క్లుప్తంగా

పిడుగుపాటు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటయ్య



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరిగి: పిడుగుపాటుకు రైతులు మృత్యువాత పడి, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పిడుగుపాటుకు రైతులు, వ్యవసాయ కూలీలు మృతి చెందుతున్నారని తెలిపారు. చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవడంతో పాటు.. గాయాలైన వారికి ప్రభుత్వం మెరుగైన చికిత్స చేయించాలని కోరారు. ప్రత్యేక విపత్తు కింద తక్షణమే పరిహారం చెల్లించాలన్నారు. అనేక పాడి పశువులు కూడా పిడుగుపాటుకు మృతి చెందాయని, వాటి యజమానులకు తగిన పరిహారం అందజేయాలన్నారు. ఇందులో నాయకులు నరేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

నవాబుపేట: నవాబుపేట (గొల్లపల్లి వద్ద ఉన్న) మహత్మజ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయం పాఠశాల, కళాశాల విద్యార్థులకు 2024–25 సంవత్సరానికి కూరగాయలు, పండ్ల సరఫరాకు టెండర్లను ఆహ్వానించారు. టెండర్ దక్కించుకున్న వారు విద్యార్థులకు కూరగాయలు, కిరాణా సరుకులు, పండ్లు, గుడ్లు, చికెన్, మటన్, క్యాటరింగ్, బార్బర్‌ను సరఫరా చేయాల్సి ఉంటుందని ఎంఈఓ గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు టెండర్ ఫారాల కొరకు కిరాణా సరుకులైతే రూ.2000, కూరగాయలు, పండ్లు, గుడ్లు, చికెన్, మటన్, క్యాటరింగ్ అయితే రూ.1000, బార్బర్ అయితే రూ.500 ప్రిన్సిపాల్ ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్ (బీట వైస్) గొల్లపల్లి పేరు మీద డీడీ తీసి టెండర్ ఫారాలను పొందవచ్చునని పేర్కొన్నారు. టెండర్ దాఖలుకు ఈ నెల 21 వరకు సమయం ఉందని, 24న కలెక్టర్ సమక్షంలో టెండర్లు తెరుస్తామని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 7989649986ను సంప్రదించాలని తెలిపారు.

సేవలు అభినందనీయం



పూజ చేస్తున్న ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా

యాలాల: ప్రభుత్వ పాఠశాలకు వంటశాల సామగ్రి అందజేసిన గంగా అరుణ ఫౌండేషన్‌కు ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అభినందనలు తెలిపారు. శుక్రవారం కోకట్ పరిధి టీఎస్ఆర్‌జేసీ పాఠశాలలో ఫౌండేషన్ సభ్యులతో కలిసి వంట సామగ్రిని పాఠశాల సిబ్బందికి ఎంపీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలకు ఫౌండేషన్ చేయూతనందించాలని కోరారు. విద్యార్థుల వసతుల కల్పనకు తన వంతు సాయం చేస్తానని ఎంపీపీ హామీ ఇచ్చారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ లావణ్య తదితరులు

తాండూరు టౌన్: పట్టణంలోని 31వ వార్డు పరిధి సమద్ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో దుకాణ సముదాయాన్ని నిర్మించాలని బీజేపీ కౌన్సిలర్ లావణ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ విక్రమసింహా రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఆ స్థలంలో ఉన్న డబ్బాలను తొలగించి, అంగన్‌వాడీ భవనం, షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని కోరారు. దీని వలన మున్సిపాలిటీకి ఆదాయం సమకూరనుందన్నారు. కౌన్సిలర్‌తో పాటు పార్టీ నాయకులు భద్రేశ్వర్ ఉన్నారు.

గోవధకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోండి

తాండూరు టౌన్: బక్రీద్ పండగ సందర్భంగా గోవధకు పాల్పడే వారిపై చట్టపరమైన తీసుకోవాలని బీజేపీ నాయకులు ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, పట్టణ సీఐలకు శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. బక్రీదును పురస్కరించుకుని కొందరు గోవులు, లేగదూడలను ఇతర ప్రాంతాలకు తరలించడంతో పాటు.. వధించనున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని స్లాటర్ హౌస్‌పై దృష్టి సారించాలని కోరారు. ఇందులో పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లేశం, ప్రధాన కార్యదర్శి కిరణ్ ముదిరాజ్, కౌన్సిలర్ బాలప్ప, నాయకులు కోట్ల నరేందర్, ప్రకాష్, దోమ కృష్ణ, సంగమేశ్వర్, చందు, శివ, శరణప్ప ఉన్నారు.

సమస్యల వలయంలో గ్రామాలు

ప్రగతికి పట్టుకొమ్మలాంటి పల్లెలు.. స్థానిక పాలకులు వెలవెలబోతున్నాయి. సర్పంచుల పదవీకాలం ముగిసిన అనంతరం ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ.. వారి పర్యవేక్షణ కొరవడి సమస్యల ఒడిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇటు మాతృశాఖలో విధులు నిర్వహిస్తూ.. అటు జీపీ బాధ్యతలను విస్మరిస్తున్నారు. దీంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

పల్లెల్లో కానరాని ప్రత్యేక అధికారులు
- భారం మొత్తం పంచాయతీ కార్యదర్శులపైనే
- పెరుకుపోతున్న సమస్యలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



నారాయణపూర్‌లో ఇళ్ల మధ్యలో మురుగు

పరిగి: పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన పడకేసింది. నాలుగు నెలల క్రితం సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన అనంతరం జిల్లా వ్యాప్తంగా ఉన్న 566 గ్రామాలకు ప్రభుత్వం గెజిటెడ్ స్థాయి అధికారులకు గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా నియమించింది. మాతృశాఖలో పాటు అదనంగా అప్పగించిన బాధ్యతలను కార్యదర్శుల భాగస్వామ్యంతో అధికారులు నెరవేర్చాల్సి ఉంటుంది. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు క్షేత్ర స్థాయిలో అమలు చేయడం, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించి, సమస్యలు ఉన్న చోట చక్కదిద్దాల్సి ఉంటుంది. దాంతో పాటే ఇంటి పన్ను వసూలు, పారిశుద్ధ్య పనులపై దృష్టి సారిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలి. ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఎంపీఓ, ఎంపీడీఓ మండల ప్రత్యేక అధికారులు కలిసి పక్షం రోజులకు లేదా నెల రోజులకు ఒకసారి గ్రామ సభలు నిర్వహించాలి. కానీ.. ఏ గ్రామంలో సభలు నిర్వహించిన దాఖలాలు లేవన్నట్లు తెలుస్తోంది. మాతృశాఖకు న్యాయం చేయలేక, అదనపు బాధ్య తలు నిర్వహించలేక తలలు పట్టుకుంటున్నారు. రెండు పడవల మీద ప్రయాణం వారికి కష్టంగా మారింది.

తీవ్ర అసౌకర్యం

పరిగి మండలం నస్కల్ గ్రామంలో మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో.. వ్యర్థ జలాలు నివాసాల మధ్య నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లిలో మురుగు నీరు వాలీబాల్ క్రీడా మైదానంలోకి ప్రవహించడంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. పలు గ్రామాల్లో తాగునీటి కష్టాలు నిత్యం ఎదురవుతూనే ఉన్నాయి. దాని గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. నారాయణపూర్ గ్రామంలో మురుగు కాలువలు లేక మురుగు ఇళ్ల మధ్యలో నిలిచి, చిన్నపాటి కుంటను తలపిస్తోంది. దోమ మండల కేంద్రంలోని గ్రంథాలయ భవనం పక్కన చెత్త చెదారం, మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. తద్వారా ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. ఇలా గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇదిలా ఉండగా.. స్థానిక ఎన్నికలు జరిగి, సర్పంచులు కొలువుదీరే వరకు ఈ కష్టాలు తప్పేలా లేవని ప్రజలు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

నిధుల కొరత అంటూ..



గ్రామాలకు ప్రత్యేక అధికారులు రావడం లేదు. సమస్యలు పెరుగుతూనే ఉన్నాయి. వాటిని పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శిని కోరితే.. నిధుల కొరత అంటున్నారు. అసలు సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. ఉన్నవారికి చెప్పినా ఉపయోగం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజా సమస్యలను పరిష్కరించాలి.

– పీర్ మహమ్మద్, నారాణపూర్, పరిగి

ప్రత్యేక అధికారే తెలియదు!

ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో సమస్యలు పెరిగిపోతున్నాయి. పట్టించుకునే వారు లేక.. ముందుకు సాగని మురికి కాలువలు, పేరుకు పోయిన చెత్తకుప్పలతో పల్లెలు కళతప్పాయి. సమస్యల గురించి ఎవరికి చెప్పుకోవాలో తెలియని స్థితిలో గ్రామస్తులు కొట్టుమిట్టాడుతున్నారు. అందుబాటులో లేని ప్రత్యేక అధికారి, పనిబారంతో కార్యదర్శి సతమవుతున్నారని, దీంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని పలువురు పేర్కొన్నారు. అసలు ఇప్పటి వరకు ప్రత్యేక అధికారి ఎవరో కూడా చాలా మందికి తెలియని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. వానాకాలం ప్రారంభం అయిన నేపథ్యంలో మునుపటి సమస్యలతో పాటు.. సీజనల్ సమస్యలు పెరగనున్నాయని, ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి, ప్రజా, గ్రామ సమస్యలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. గతంలో పనులు చేసేందుకు జీపీ కార్యదర్శి, సర్పంచ్‌కి జాయింట్ చెక్ పవర్ ఉండేదని, ప్రత్యేక పాలనలో ప్రత్యేక అధికారులకు, కార్యదర్శులకు చెక్ పవర్ ఉండటం.. ఆ అధికారులు మాతృశాఖ పనుల్లో బిజీగా ఉండటంతో గ్రామాల్లో సమస్యల తిష్ట రోజురోజుకూ పెరుగుతూనే ఉందని ప్రజలు తెలిపారు.



దోమ గ్రామంలో చెత్త చెదారంతో నిండిన మురుగు కాలువ

వార్డుల వారీగా అభివృద్ధి

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

పరిగి: వార్డుల వారీగా సమస్యలను తెలుసుకుని, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌన్సిలర్లు ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పాలకవర్గం దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని వెల్లడించారు. వర్షాలు కురుస్తున్నందున మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, ప్రతి వార్డులో సెత్త సేకరణ చేపట్టాలని సూచించారు. వైస్ చైర్మన్ ప్రసన్న లక్ష్మి, కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు అర్చన, రవికుమార్, వాసియా, కిరణ్, రవీందర్, నాగేశ్వర్, వెంకటేశ్ ఉన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుకు సహకరించండి

తాండూరు టౌన్: ల్యాబ్ ఏర్పాటుకు సహకరించాలని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విజయారాణి మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నను కోరారు. శుక్రవారం ఆమె చైర్‌పర్సన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తాండూరుకు నర్సింగ్ కళాశాల మంజూరై పీపీ యూనిట్‌లో తరగతులు కొనసాగుతున్న విషయం విధితమే. అరకొర వసతుల మధ్య విద్యార్థినులు తరగతులు వింటూ, అక్కడే ఏర్పాటు చేసిన హాస్టల్‌లో నివసిస్తున్నారు. అయితే రెండో సెమిస్టర్‌లో విద్యార్థినులకు కంప్యూటర్ ల్యాబ్ అవసరం అయిందని, అందుకు సహకరించాలని ప్రిన్సిపాల్ కోరగా.. చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించారు.

'చైతన్యం' ఏదీ?

- అవగాహన లోపంతో నష్టపోతున్న రైతులు

మోమిన్‌పేట: పైపాటుగా వేయాల్సిన ఎరువులు, దుక్కిలో కలియ దున్నాల్సిన ఎరువులు వేర్వేరుగా ఉన్నా.. రైతులు మాత్రం అన్ని రకాల ఎరువులను పైపాటుగానే వేస్తున్నారు. దీంతో మొక్కలకు అందాల్సిన ఎరువులు అందక.. పెట్టుబడులు పెరిగి రైతులు నష్టపోతున్నారు. మొక్కకు నత్రజనిని అందించే యూరియా ఒక్కటి మాత్రమే పైపాటుగా మొక్కకు అందించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నా.. అన్నదాతలు మాత్రం పైపాటుగానే వినియోగిస్తున్నారు.

సీజన్‌కు ముందే..

వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే చైతన్య, అవగాహన సదస్సులు నిర్వహించి, సాగుపై రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన వ్యవసాయ అధికారులు ఇప్పటి వరకు అలాంటి చర్యలు ఏవీ చేపట్టలేదు. అసలు వారి జాడే కనిపించడం లేదని రైతులు పేర్కొంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగి యంత్రాలతో సాగు చేస్తునప్పటికీ.. ఎరువుల వాడకంలో సరైన అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు తెలిపారు.



పైపైనే ఎరువులను వేస్తున్న రైతు

నేలలు నిస్సారం

యూరియా తప్ప మిగతా అన్ని ఎరువులను ఆఖరి దుక్కిలో కలియ దున్నాలి. అప్పుడే మొక్క వేరుకు ఎరువులు అంది పంట ఏపుగా పెరుగుతుంది. ఈ విషయం తెలియని రైతులు కొందరు పైపైన ఎరువులు వేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇలా చేయడం వలన భూమిలో భాస్వరం నిల్వలు పెరిగి సారవంతమైన నేలలు నిస్సారం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఖరీఫ్ ప్రారంభానికి ముందే ఎరువుల వాడకంపై సలహాలు, సూచనలు ఇవ్వాలని వ్యవసాయాధికారులను అన్నదాతలు కోరుతున్నారు.

వానాకాలంలో అప్రమత్తంగా ఉండండి

డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు రూరల్: వానాకాంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి అల్లాపూర్, బెల్కటూర్, మల్కాపూర్, సంగెంకలాన్ గ్రామ శివారులోని వాగులను ఆయన పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నప్పుడు ప్రజలు వాటిని దాటొద్దని సూచించారు. వర్షాలు కురిసినప్పుడు పొలాల్లోని చెట్ల కింద ఉండరాదని, శిథిలావస్థ ఇళ్లల్లో నివసించరాదని తెలిపారు. వాగుల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగింప జేయాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. డీఎస్పీ వెంట కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి, బెల్కటూర్ మాజీ సర్పంచు వడ్డె మధులు ఉన్నారు.

చెక్‌పోస్ట్ పరిశీలన

కర్ణాటక–తెలంగాణ సరిహద్దు కోత్లాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును డీఎస్పీ సందర్శించారు. బక్రీద్ పండుగ సందర్భంగా కర్ణాటక రాష్ట్రం నుంచి గోవులను తరలించకుండా అప్రమత్తంగా ఉండాలని చెక్‌పోస్ట్ సిబ్బందిని దేశించారు.

కల్వర్టు నిర్మాణం కలేనా?



ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

- ఏళ్లుగా ఎదురు చూస్తున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

దౌల్తాబాద్: కల్వర్టు నిర్మాణం కలగానే మిగిలింది. బాలంపేట నుంచి అంతారం గ్రామం మధ్యలో ఉన్న కల్వర్టు ఎనిమిదేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు తెగిపోయింది. ప్రమాదాలకు నిలయంగా మారింది. మరమ్మతు చేయించాల్సిన అధికారులు ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. గతేడాది అక్టోబర్‌లో నాటి ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి.. కల్వర్టు నిర్మాణానికి రూ.80లక్షలు నిధులు మంజూరయ్యాయని, పనుల ప్రారంభానికి శిలాఫలకం సైతం శంకుస్థాపన చేశారు. కానీ ఇంత వరకు నిర్మాణ పనుల ఊసే లేకుండా పోయింది. దీంతో కల్వర్టు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న దంపతులు అదుపు తప్పి కల్వర్టుపై నుంచి కిందపడిపోయారు. తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. అధికారులు స్పందించి కల్వర్టును కొత్తగా నిర్మించడమో, మరమ్మతు చేయించడానికే తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



కల్వర్టు నిర్మాణ పనులకు వేసిన శిలాఫలకం (ఫైల్)

సంక్షిప్త వార్తలు

◆ **పాఠశాలల అభివృద్ధికి నిధులు**

బొంరాస్‌పేట: ఉమ్మడి బొంరాస్‌పేట మండల పరిధి పాఠశాలలకు ఈ ఏడాది అదనపు తరగతి గదుల నిర్మాణానికి పీఎం ఎస్‌హెచ్‌ఆర్‌ఐ పథకం కింద నిధులు మంజూరయ్యాయని ఎంఈఓ రాంరెడ్డి తెలిపారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఏడబ్ల్యూపీ అండ్‌బీ నిధులు రూ.27లక్షలు, చిల్మల్‌మైలారం ప్రాథమికోన్నత పాఠశాలకు రెండు అదనపు తరగతి గదులకు పీఎం ఎస్‌హెచ్‌ఆర్‌ఐ నిధులు రూ.27లక్షలు, చిల్మల్‌మైలారం సైన్స్‌ల్యాబ్‌కు రూ.13.50లక్షలు కేటాయించినట్లు ఎంఈఓ పేర్కొన్నారు. కొడంగల్ జెడ్పీహెచ్‌ఎస్ బాలికలకు అదనపు తగరతి గదికి రూ13.50లక్షలు, దౌల్తాబాద్ జెడ్పీహెచ్‌స్‌కు అదనపు తరగతి గదులకు రూ.27లక్షలు, చౌడాపూర్ మండలం మరికల్ జెడ్పీహెచ్‌ఎస్‌కు 13.50లక్షలు, కొడంగల్ మండలం రుద్రారం జెడ్పీహెచ్‌ఎస్‌లో ల్యాబ్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఎంఈఓ వెల్లడించారు.

◆ **మాట నిలబెట్టుకున్న స్పీకర్**

ధారూరు: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారు. మాట ప్రకారం మండల పరిధి నాగారం గ్రామం వడ్డెర కాలనీలో శుక్రవారం బోరు వేయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అనంతయ్య, శ్రీనివాస్, వెంకటయ్య, అనంతయ్య, నర్సింహులు, వెంకటేలు మాట్లాడుతూ.. కాలనీకి ఇచ్చిన హామీ ప్రకారం స్పీకర్.. బోరు వేయించారని తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఇందులో గ్రామ కార్యదర్శి సూరీబాబు పాల్గొన్నారు.

◆ **నీటి సర్వేను పూర్తి చేయాలి**

దోమ: పంచాయతీ కార్యదర్శులు మీషన్ భగీరథ నీటి సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ మహేశ్ బాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్యదర్శి చంద్రశేఖర్ నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఇంటి యాజమానులను నీరు సక్రమంగా అందుతుందా లేదా? అని అడిగి తెలుసుకున్నారు.

◆ **విధుల్లో చేరిన 9 మంది జీహెచ్‌ఎంలు**

కొడంగల్: నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో 9 మంది గెజిటెట్ హెడ్ మాస్టర్లు విధుల్లో చేరారని ఎంఈఓ రాంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతాదేవి (జెడ్పీహెచ్‌ఎస్ రుద్రారం), వెంకటేశ్వర్లు (జెడ్పీహెచ్‌ఎస్ బాలుర కొడంగల్), మురళీధర్ (జెడ్పీహెచ్‌ఎస్ అంగడిరాయిచూర్), చంద్రశేఖర్ (జెడ్పీహెచ్‌ఎస్ రావులపల్లి), నర్సింలు (జెడ్పీహెచ్‌ఎస్ హస్నాబాద్), రవీందర్ (జెడ్పీహెచ్‌ఎస్ చౌదర్‌పల్లి), విజయ రామారావ్ (జెడ్పీహెచ్‌ఎస్ దుద్యాల), ప్రతాప్‌రెడ్డి (జెడ్పీహెచ్‌ఎస్ కుదురుమళ్ల), నరేందర్ (జెడ్పీహెచ్‌ఎస్ హకీంపేట) విధుల్లో చేరారని ఎంఈఓ తెలిపారు.


దుద్యాల్‌లో..

దుద్యాల్: పదోన్నతుల్లో భాగంగా మండలానికి ముగ్గురు జీహెచ్‌ఎంలు వచ్చారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విజయ్ రామారావ్, హకీంపేట్ జెడ్పీహెచ్‌ఎస్‌కు నరేందర్, కుదురుమల్ల జెడ్పీహెచ్‌ఎస్‌కు ప్రతాప్ రెడ్డిలను నియమించగా.. వారు విధుల్లో చేరారు.

◆ **రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు**

తాండూరు రూరల్: పొలాలకు వేళ్లే రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. శుక్రవారం మండల పరిధి చంద్రవంచ గ్రామ శివారులో ఉన్న వివాదాస్పద కాలువను ఆయన పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడారు. రైతుల ఫిర్యాదు మేరకు కాలువను పరిశీలించామన్నారు. సర్వే అనంతరం తవ్విన కాలువ ఏ సర్వే నంబర్లో ఉన్నదో తెలిసిన తరువాత చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

◆ **తాగునీటి సమస్య పరిష్కరించండి**



యాలాల: మండల పరిధి తొప్పెర్లగడ్డతండాలో వారం రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొని.. గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. తండాకు తాగునీటి సరఫరా చేసే మోటారు మరమ్మతులకు గురైందని, వ్యవసాయ పొలాల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని తండా వాసులు తెలిపారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను తీర్చాలని కోరుతున్నారు.

◆ **ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు**

బంట్వారం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ విజయ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులతో కలిసి శుక్రవారం ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు ప్రభుత్వ పథకాలు పొందనట్లయితే మరోసారి అర్జీ పెట్టుకోవాలని సూచించారు. ముఖ్యంగా కరెంటు బిల్లులు, సబ్సిడీ గ్యాస్ తదితర పథకాల్లో లబ్ధిపొందని వారు సేవా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

తాండూరు టౌన్‌లో..

తాండూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న సూచించారు. మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డితో కలిసి ఆమె కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆమె తెలిపారు.

సర్కారు బడుల్లోనే చేరండి

- నాణ్యమైన విద్యను పొందండి
- ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బోధన
- ఉచితంగా పుస్తకాలు, భోజన సౌకర్యం సద్వినియోగం చేసుకోండి
- ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధుల సూచన
- పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం



కుల్కచర్ల: పీరంపల్లి పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం అనంతరం రాత పుస్తకాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

కుల్కచర్ల: సర్కారు బడుల్లో ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్యను బోధిస్తుండటంతో పాటు.. ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేస్తున్నామని పీరంపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మానస అన్నారు. శుక్రవారం మండల పరిధి పీరంపల్లి గ్రామంలో అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు జంగయ్య, నర్సింలు, వెంకటయ్య, పెంటయ్య, వడ్ల నర్సింలు, మొగులయ్య, బిచ్చయ్య, సత్యయ్య, రమే, చింతకాయల నర్సింలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని హెచ్‌ఎం కేశవులు అన్నారు. మండల పరిధి పంచలింగాల యూపీఎస్ పాఠశాలలో అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలకు వచ్చే పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, నోట్‌పుస్తకాలతో పాటు నాణ్యమైన భోజనం ప్రభుత్వం అందజేస్తుని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అన్ని వసతులను సమకూర్చుతుందని వెల్లడించారు. ఇందులో సీఆర్‌పీ మల్లేశం, ఏపీసీ చైర్మన్ శ్యామలమ్మ, ఉపాధ్యాయులు శోభారాణి, సుభానా, అంగన్‌వాడీ వర్కర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

విద్యావంతులు కావాలి..

పెద్దేముల్: ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించి, ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, విద్యావంతులు కావాలని సూచించారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రవిందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, రాధ, సంగీత, సఫీజ్ సుల్లాన తదితరులు ఉన్నారు.

బొంపల్లి ప్రాథమిక పాఠశాలలో..

దోమ: ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యులు రాములు అన్నారు. మండల పరిధి బొంపల్లి ప్రాథమిక పాఠశాలలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకట్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షఫీతో కలిసి పాఠశాలలో చేరిన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఎంపీటీసీ మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని సూచించారు. ఇందులో సీఆర్‌పీ వెంకటేశ్, ఉపాధ్యాయులు శివశంకర్, స్వప్న, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బడిలో చదువు తక్కువ, ఫీజులు ఎక్కువ

తాండూరు టౌన్: ప్రైవేటు పాఠశాలల్లో చదువు తక్కువ, ఫీజులు ఎక్కువ అని, అది తల్లిదండ్రులు గమనించాలని కౌన్సిలర్ బాంబిన సూచించారు. 14 వార్డు పరిధి మాణిక్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ఆమె విద్యార్థులకు యూనిఫాంలు అందజేశారు. అనంతరం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో డీఎస్సీ ద్వారా బోధనార్హతలు పొందిన ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారని తెలిపా రు. ప్రైవేటు కంటే సర్కారు బడుల్లోనే ఉత్తమ బోధనే లభిస్తుందని వెల్లడించారు.



యూనిఫాంలు అందజేస్తున్న కౌన్సిలర్

విద్యార్థులకు ఉచిత పుస్తకాలతో పాటు, యూనిఫాంలు, మధ్యాహ్నం భోజనం ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు. కావున తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆమె కోరారు.